క్లుప్తంగా

నేడు అల్లాడుపల్లె, వెదురూరులో వైద్య శిబిరం

చాపాడు: మండల పరిధిలోని అల్లాడుపల్లె, వెదురూరు గ్రామాల్లో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. అల్లాడుపల్లెలో వైద్యాధికారి కావ్యమాధురి, వెదురూరులో వైద్యాధికారి ఓబులేసు వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆయా గ్రామాల పరిధిలోని ప్రజలకు వైద్య పరీక్షలు చేసి.. మందులు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చౌడేశ్వరీదేవికి 2 కిలోల వెండి కానుక



ఆలయ చైర్మన్ నాగశయనంకు వెండి అందజేస్తున్న దాతలు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక మేదరవీధిలోని శ్రీరామలింగ చౌడేశ్వరీదేవి ఆలయంలో మంగళవారం అమ్మవారికి ఆభరణాల తయారు చేసేందుకు రూ.1.60 లక్షలు విలువచేసే రెండు కిలోల వెండిని దాతలు ఆలయ కమిటీ అధ్యక్షుడు వుట్టి నాగశయనంకు అందచేశారు. దాతలు మందల పాల వెంకటరాఘవేంద్ర, సతీమణి సుష్మ, కుమార్తె ఆధ్య, మాలెపాటి రవితేజ సతీమణి సుధామాధురి అమ్మవారికి ఆభరణాల కోసం వెండి వితరణ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతలను శాలువ కప్పి ఆలయ చైర్మన్ సత్కరించారు. ఆలయ కమిటీ కార్యదర్శి శ్రీనివాసులు, మెంబర్లు లక్ష్మీనారాయణ, గిద్దలూరు ఈశ్వరయ్య, మచ్చా వెంకట సుబ్బరాయుడు, శివప్రసాద్, రామకృష్ణ, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే కవుల లక్ష్యం



కవులను సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రొద్దుటూరు కల్చరల్: కవులు సామాజిక అంశాలను రచించి ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా కృషి చేయాలని కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డీకే చదువులబాబు సూచించారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లోని గ్రంథాలయంలో క్రోధినామ సంవత్సర ఉగాది సందర్భంగా రామరాజభూషణ సాహితీ పీఠం ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ కవులు ప్రకృతి అందం, స్వచ్ఛత, ఓటు ప్రాముఖ్యత, సామాజిక బాధ్యతలపై రచనలు చేసి ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. క్రోధినామ సంవత్సరంలో క్రోథ భావం లేకుండా కుటుంబసభ్యులతో పాటు ఇరుగు పొరుగు వారితో సఖ్యతగా మెలగాలన్నారు. రామరాజ భూషణ సాహితీ పీఠం నేటి తరానికి సాహిత్యాన్ని పరిచయం చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందని కొనియాడారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను ఈ సందర్భంగా శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కవులు పల్లా వెంకట రామారావు, కాశీవరపు వెంకట సుబ్బయ్య, పుత్తూరు సుబ్రహ్మణ్యం, అనిల్, శివ, గణపతి, వెంకటేశ్వర్లు, కామనూరు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



అపస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

పోరుమామిళ్ల: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా భరతమాత రైతుబజార్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. అపస్ జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య చలివేంద్రం వద్ద ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. బస్టాండ్‌కు అనేక ప్రాంతాల నుంచి ప్రయాణికులు వచ్చిపోతూ ఉంటారని, చలివేంద్రం ఏర్పాటు చేయడం వలన దాహార్తి తీర్చుకుంటున్నారు. అపస్ నాయకులు రామకృష్ణారెడ్డి, బాలరంగయ్య, గురుమూర్తి, సుబ్రమణ్యం, రమణ, సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఓబులేసు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



రవిని పరామర్శిస్తున్న రామగోవిందరెడ్డి

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠం మండలం పలుగురాళ్లపల్లె గ్రామంలో ఇటీవల కాలు విరిగి బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త మొరతోటి రవిని జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి పరామర్శించారు. ఆరోగ్య విషయం తెలుసుకుని వైద్య ఖర్చుల కోసం రూ.20 వేల ఆర్థికసాయం చేశారు. త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో తొలి పండుగ

- ఘనంగా ఉగాది సంబరాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండా వధూత ఆశ్రమం, గోవిందయ్య మఠం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని మంగళవారం స్వామివారి గరుడవాహన సేవ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుడి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వెంకటనారాయణరెడ్డి, శ్రీధర్, జి.మల్లేశ్వరి, సుభద్రమ్మ, సరస్వతి, వరలక్ష్మి, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నెల్లూరురోడ్డులోని ఎస్.వి.ఎస్ మార్కెటింగ్, డెవలపర్స్ కార్యాలయంలో నిర్వహించిన క్రోధినామ సంవత్సర ఉగాది ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగులోగిళ్లు సంప్రదాయాలను కొనసాగిస్తూ ప్రతి ఏటా ఉగాది సంబరాలను బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. వాస్తుజ్యోతిష్య పండితులు బ్రహ్మశ్రీ కనుమళ్ల సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పంచాంగ శ్రవణం ఆకట్టుకుంది. క్రోధినామ సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో జీవనం సాగిస్తారని తెలిపారు.

ఉగాది శుభాకాంక్షలు చెప్పిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : తెలుగు సంవత్సరాది శ్రీ క్రోధి నామ సంవత్సరం సందర్భంగా మంగళవారం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకుల మధ్య కేక్ కట్ చేసి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయ కర్త కె. రమణారెడ్డి, బద్వేలు మునిసిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్ రెడ్డి, మునిసిపాలిటి పార్టీ అధ్యక్షులు సుందరరామి రెడ్డి, నాయకులు పుత్తా శ్రీరాములు, నారాయణరెడ్డి, ఏరియా కన్వీనర్ నాగేశ్వరరావు, బూతు కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



చాపాడు: ప్రత్యేక పూజలందుకుంటున్న అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి

వీరభద్రస్వామి సన్నిధిలో వేడుకలు

చాపాడు : మండల పరిధిలోని ముఖ్య పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది సందర్భంగా సామవేద శిఖామణి నరేంద్రశర్మ ఆధ్వర్యంలో శ్రీవీరభద్రస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ ఏడాది కలిగే ప్రయోజనాలు, లాభ నష్టాలపై పఠనం చేశారు.

తమలపాకుల అలంకరణలో వీరాంజనేయస్వామి



ప్రొద్దుటూరు కల్చరల్: తమలపాకుల అలంకరణలో వీరాంజనేయస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం ఉగాది సందర్భంగా వీరాంజనేయస్వామికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించారు. పంచామృతాభిషేకం కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేకంగా తమల పాకులు, వివిధ రకాల పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్థానిక శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సాయంత్రం బీవీ రామకృష్ణయ్య సిద్ధాంతి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిగింది. క్రోధి నామ సంవత్సరం ఎలా ఉంటుందో వివరించారు. నల్లరేగటి భూముల్లో పండే పంటలకు విలువ ఉంటుందన్నారు. వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. దేశ ఆర్థిక ప్రగతి బాగుంటుందన్నారు. వివిధ రాశుల వారికి ఆదాయ, వ్యయాలు, మంచి, చెడుల గురించి తెలిపారు.

ఉగాది పచ్చడి పంపిణీ

స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో మంగళవారం ఉగాది పండుగ సందర్భంగా ఆదరణ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. నూతన తెలుగు సంవత్సరం అందరికి శుభాలు తేవాలని సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కుండా మాధవ, లక్షుమయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు

కాశినాయన : తెలుగు సంవత్సరాది క్రోధి నామ సంవత్సరం ఉగాది పండుగను మంగళవారం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఎద్దులు ఉన్న వారు ఎద్దులను అలంకరించి పొలాల్లోకి వెళ్లి ఏరువాక నిర్వహించారు.

ఘనంగా శ్రీక్రోధినామ సంవత్సర వేడుకలు

గోపవరం : శ్రీక్రోధినామ సంవత్సర వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మండల వ్యాప్తంగా అన్ని ఉగాది పర్వదినం సందర్భంగా కోదండరామస్వామి ఆలయాల్లో పంచాంగ శ్రవణంతో పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో పాటు రైతులకు అన్నివిధాలుగా బాగుంటుందని పంచాంగకర్తలు తెలియజేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో కోదండరామస్వామి గ్రామోత్సవాలు నిర్వహించారు.

వైభవంగా పల్లకీ సేవ

రాజుపాళెం : ఉగాది పండుగను పురస్కరించుకుని మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలో మంగళవారం సాయంత్రం వైభవంగా పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ చైర్మన్ బుక్కసముద్రం జగదీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ, సంజీవరాయస్వామి, గంగాగౌరి సమేత భీమలింగేశ్వరస్వాములను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో ఆశీనులను చేసి ఆలయం చుట్టు ఊరేగించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బాల నాగిరెడ్డి, ఆలయాల కమిటీ సభ్యులు బీరం వెంకటరామిరెడ్డి, సుప్రజ, దాసమ్మ, ఆనంద్, జంగం రెడ్డి, రమణ, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో..

బ్రహ్మంగారిమఠం : క్రోధినామ సంవత్సరం ఉగాది సందర్భంగా మంగళవారం బి.మఠం మండలంలో ఉగాది సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని చోట్ల పంచాగ పఠనం నిర్వహించారు. సాయత్రం ఏరువాక సాగించారు. పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారి మఠంలో మంగళవారం సాయంత్రం నూతన పంచాగం పుస్తకాన్ని పూర్వపు మఠాధిపతి కుమారులు వెంకటాద్రిస్వామి. దత్తాత్రేయస్వామి, వీరంబట్లయ్యస్వామి, గోవిందస్వామి, మఠం మేనేజర్ ఈశ్వరాచారి ఆవిష్కరించారు.



బద్వేలు అర్బన్: గరుడ వాహనంపై శ్రీనివాసుడు



రాజుపాళెం: వెల్లాలలో పల్లకి సేవలో స్వామి వారు



పోరుమామిళ్ల: ఉగాది కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

మోసపూరిత హామీలకు మోసపోవద్దు

ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధీర్‌రెడ్డి

కొండాపురం : మూడు పార్టీలు జతకట్టి మీ ముందుకు ఎన్నికల ప్రచారంలో మోస పూరిత హామీలతో వస్తారు ఎవరూ మోసపోవద్దని.. జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని రామిరెడ్డిపల్లె, ఏటూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండికోట జలాశయం కింద ముంపునకు గురైన రెండో విడత గ్రామాల్లో ఏటూరుకు ఎన్నికల సమయంలో చెప్పిన మాట ప్రకారం గండికోట నిర్వాసితులకు రూ.10 లక్షలు పరిహారం అందజేశామన్నారు. మిగిలిన రాని వారికి తప్పకుండా పరిహారం అందిస్తామన్నారు. వచ్చేది మన ప్రభుత్వమే తప్పకుండా న్యాయం చేస్తామన్నారు.రాష్ట్రంలోబడుగు బలహీన వర్గాల వారికి సీఎం వైస్ జగనన్నా పెద్దపీట వేశారన్నారు.ఐదేళ్లల్లో పార్టీలు చూడకుండా ప్రతి ఒక్కరికి సంక్షేమం అందించిన మీ బిడ్డను మరోసారీ ముఖ్యమంత్రి చేసుకోవాలంటే ప్రతి ఒక్కరు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మోజారిటితో గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. గత టిడిపి ప్రభుత్వం ఎన్నికలకు ముందు మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని విస్మరించడంతో పాటు జన్మభూమి కమిటిలతో ప్రజలను వేదింపులకు గురిచేసిందని గుర్తు చేశారు. మరోమారు మోస పూరిత మాటలతో ప్రలోభాలకు గురి చేయడానికి టీడీపి నాయకులు వస్తున్నారని వారి అబద్ధపు మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనతోపాటు ఎంపి అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిను గెలిపించాలని ప్రజలను ఆయన అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో మండల నాయకుడు చింతారాజారెడ్డి, రాష్ట్ర కనీస వేతనాల సలహా కమిటి చెర్మన్ ఓంటెద్దు రఘునాథ రెడ్డి, మండల కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి,స్థానిక నాయకులు గ్రామ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి,సూర్యనారాయణరెడ్డి, అల్లం సత్యం,సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయమని అభ్యర్థిస్తున్న డాక్టర్ సుధీర్‌రెడ్డి

వైభవంగా కొండ గంగమ్మ తిరునాల ఉత్సవాలు

పెండ్లిమర్రి : ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని నందిమండలం గ్రామ సమీపంలో వెలసిన కొండ గంగమ్మ తిరునాల ఉత్సవాలు మూడవ రోజు మంగళవారం వైభవంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

తిరునాల సందర్భంగా నిర్వాహకులు బండలాగుడు పోటీలను ఏర్పాటు చేశారు. పోటీలకు 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. గెలుపొందిన ఎద్ల యజమానులకు బహుమతులు అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోండి

కొండాపురం : సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ప్రొబేషనరి జమ్మలమడుగు డీఎస్పీ శ్రీ కాంత్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సమస్యాత్మక గ్రామం అయిన వెంకయ్యకాలవ గ్రామంలో కేంద్ర సాయుధ బలగాలంతో పోలీస్‌లు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన నిర్వహించారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రజలు సహకరించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ఎటువంటి సమస్య వచ్చినా పోలీస్‌ల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీనాయకులు

ఖాజీపేట: మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఖాజీపేట ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో ఎమ్మెల్యే పాల్గొని ఉపవాసాలు చేపట్టిన ముస్లింలతో దీక్షలు విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు నిష్ఠతో సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం దాకా ఉపవాస దీక్షను పాటించి విరమణ చేసే ఇఫ్తార్‌లో తాను పాల్గొనడం పూర్వజన్మ సుకృతమన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచే మనదేశంలో కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ విందులను ఇవ్వడం ఔన్నత్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ముస్లింలందరూ ఆనందోత్సాహాలతో రంజాన్ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం రఘురామిరెడ్డిని, ఆయన కుమారుడు శెట్టిపల్లి అశోక్‌రెడ్డిని జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, ఎంపీపీ అబుబకర్ సిద్దిక్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు బనగానిపల్లె మహబూబ్ బాషా, కడప ఆర్టీసీ మాజీ జోనల్ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ అధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్యం రామకృష్ణారెడ్డి, పుల్లూరు మాజీ ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు పెద్దిరెడ్డి, చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ గురురెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, ముత్తులూరు పాటు నాయకులు దవనం గంగాధర్, మండల కోఆప్షన్ సభ్యుడు మున్వర్, హఫీజుల్లాతో పాటు పలువురు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచార హోరు.. రాచమల్లు జోరు

- 49వ రోజుకు చేరిన ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి ప్రచారం



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని దివ్యాంగుడిని కోరుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రొద్దుటూరు అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఎన్నికల ప్రచారం 49వ రోజుకు చేరుకుంది. ఫిబ్రవరి 15న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఎంపీ అభ్యర్థి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని 41 వార్డులకుగాను 27, 28 వార్డులు మినహా అన్ని వార్డుల్లో ఎన్నికల ప్రచారం పూర్తయింది. సోములవారిపల్లె గ్రామ పంచాయతీలో పూర్తి చేసుకుని, ప్రస్తుతం గోపవరం గ్రామ పంచాయతీలో ప్రచారం కొనసాగుతోంది. సంక్షేమ పథకాల అమలు, మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధి పనుల కారణంగా ప్రచారంలో ఎమ్మెల్యేకు అనూహ్య స్పందన వస్తోంది. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోదరుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆయన కుమారుడు రాచమల్లు రాఘవేంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయన సతీమణి పాతకోట కృష్ణవేణి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాలపై రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డి దృష్టి సారించారు. గత నెల 27న మేమంతా సిద్ధం మొదటి బహిరంగ సభను సీఎం జగన్‌ ప్రొద్దుటూరులో నిర్వహించి కార్యకర్తలు, నాయకుల్లో ఉత్తేజాన్ని నింపారు.

అందరిని ఆకట్టుకుంటున్న రాచమల్లు

ఎమ్మెల్యే ఓ వైపు ప్రచారం చేస్తూ మరోవైపు సామాజిక వర్గాల వారిగా సభలు, సమావేశాలు నిర్వహిస్తూ అందరిని ఆకట్టుకుంటున్నారు. శ్రీవాసవి కల్యాణ మండపంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించి తాను చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ఎమ్మెల్యే వివరించారు. టీడీపీ అభ్యర్థి వరదరాజులరెడ్డి ఆర్యవైశ్యుల పట్ల ఏవిధంగా వ్యవహరించారో సభలో వివరించారు. సభలో వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరించడంతోపాటు టీటీడీ పాలకమండలి సభ్యుల పదవిని మళ్లీ ప్రొద్దుటూరు ఆర్యవైశ్యులకే ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల నూర్ బాషా దూదేకుల కులస్తుల సమావేశం, ప్రొద్దుటూరు బీసీ సమాఖ్య సమావేశం నిర్వహించారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వేల సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. అలాగే మాజీ ఎమ్మెల్యే ఎంవీ రమణారెడ్డి కుటుంబ సభ్యులతో కలసి సమావేశం ఏర్పాటు చేశారు. కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి టీడీపీలో చేరడంతో ఎమ్మెల్యే స్వయంగా ఆయన స్వగ్రామమైన కానపల్లెకు వెళ్లి మద్దతు కోరారు.

మాజీ ఎంపీపీ చేరికతో పెరిగిన బలం

రాజుపాళెం మాజీ ఎంపీపీ మెట్టుపల్లె ప్రభాకర్‌రెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయన టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరడంతో రాజుపాళెం మండలంతోపాటు ప్రొద్దుటూరులో పార్టీకి మరింత బలం పెరిగిందని చెప్పవచ్చు. మాజీ ఎమ్మెల్యే ఎంవీ రమణారెడ్డి బావమరిది సురేంద్రనాథ్ రెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరడం మరింత కలిసి వచ్చింది. అమృతానగర్‌లో వందల కుటుంబాలు పార్టీలో చేరాయి.

ఘనంగా ఆరాధన ఉత్సవాలు



స్వామి దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం: శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి శిష్యుడు సిద్దయ్య నాలుగో కుమారుడు పెద్దపీరయ్య స్వామి ఆరాధన ఉత్సవాలు మంగళవారం సిద్దయ్యమఠంలో ఘనంగా నిర్వహించారు. సిద్దయ్యమఠం పీఠాధిపతులు రామకృష్ణయ్య సోదరుల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బి.మఠం ఎస్ఐ విద్యాసాగర్ బందోబస్తు ఏర్పాటు చేసారు. పెద్ద పీరయ్యస్వామి ఆరాధన సందర్భంగా బుధవారం బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు.

